క్లుప్తంగా

సన్మానం



సులేమాన్‌ను సన్మానిస్తున్న సీపీ, డీసీపీ తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని మహ్మద్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ సులేమాన్‌ను పోలీసులు సన్మానించారు. గ్రామ పరిధిలో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు సహరించినందుకుగాను ఆయనను మల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీ సుధీర్‌బాబు, డీసీపీ సునీతారెడ్డి తదితరులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

మృతులకు నివాళి



నివాళి అర్పిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి కార్పొరేషన్ పరిధి 4వ డివిజన్ శేషాద్రి కాలనీలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అమాయకులను బలిగొన్న ముష్కరులను, వారికి సహకరిస్తున్న పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పాలని కాలనీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి



మహేశ్వరం: బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాధనే ధ్యేయంగా ఏర్పడిన పార్టీకి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆదివారం వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభ జరగనుందని తెలిపారు. మహేశ్వరం మండలం నుంచి మాజీ మంత్రి సబితారెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభకు మండలం నుంచి 100 కార్లు, 12 బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



తుక్కుగూడలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తుక్కుగూడ: ప్రపంచ కార్మిక దినోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి.దత్తునాయక్ కార్మికులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల దినోత్సవం సందర్భంగా వాడవాడలా కార్మిక జెండాను ఎగురవేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దేవేందర్‌గౌడ్, రాజు, యాదగిరి, భాను, సురేష్, లాలు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు కదలిరండి

తుక్కుగూడ: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్ అన్నారు. శనివారం పుర పరిధిలోని రావిర్యాలలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో రజతోత్సవ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు పార్టీ శ్రేణులు మాజీ మంత్రి పి.సబితారెడ్డి నాయకత్వంలో మున్సిపాలిటీ వ్యాప్తంగా అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి నందిహిల్స్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. సభకు మీర్‌పేట నుంచి అధిక సంఖ్యలో వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, నాయకులు అనిల్‌యాదవ్, సిద్దాల లావణ్య, రవిందర్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, రజాక్, సునీత బాలరాజు, విజయలక్ష్మి, పంతంగి మాధవి తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట: నందిహిల్స్ కూడలిలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న కామేశ్‌రెడ్డి



తుక్కుగూడ: మంఖాల్‌లో..

బీఆర్ఎస్ జెండాను చూస్తే వణుకు

- అధికార పార్టీ నేతల్లో కలవరం
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభను ఆపలేరు
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- నియోజకవర్గంలో జెండాల ఆవిష్కరణ



హుడాకాంప్లెక్స్: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: 'బీఆర్ఎస్ జెండాను చూస్తే అధికార పార్టీ నాయకుల్లో వణుకుపుడుతోంది. కేసీఆర్‌కు ఉన్న జనాధరణను ఎవరూ ఆపలేరు. ఫ్లెక్సీలు చించినంత మాత్రాన సభను అడ్డుకోలేరు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. ప్రజలే స్వచ్ఛందంగా సభకు తరలి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు' అని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. పార్టీ రజతోత్సవాలను పురస్కరించుకుని శనివారం సరూర్‌నగర్ డివిజన్ అంబేడ్కర్‌నగర్ కాలనీలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ, బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవాల నేపథ్యంలో కార్యకర్తలు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను చించివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ నేతల ఫ్లెక్సీలు నెలల తరబడి ఉన్నా పట్టించుకోని అధికారులు ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ జెండాలను తొలగించడం సరి కాదన్నారు. అధికారులు చట్ట ప్రకారం పని చేయాలని, అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తే ఆ తర్వాత భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని అడ్డంకులు సృష్టించినా రజతోత్సవ సభను విజయవంతం చేసి తీరుతామన్నారు. బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, కేసీఆర్‌తోనే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. జనమే కేసీఆర్ మళ్లీ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీ సీనియర్ నాయకులు ఇంటూరి అంకిరెడ్డి, అర్వింద్‌శర్మ, లోకసాని కొండల్‌రెడ్డి, రుషి, సందీప్, శ్యామ్‌గుప్తా పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు చర్యలు

- గుర్రపుడెక్క తొలగింపునకు రూ.45 లక్షలు
- ఎమ్మెల్యే సబితారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..



మీర్‌పేట: మున్సిపాలిటీ పరిధిలోని మూడు చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపునకు రూ.45 లక్షల నిధులు కేటాయించామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. ఇక మీదట చెరువుల పరిరక్షణకు నిరంతరం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'చెరువులచెంత.. సందర్శకుల చింత' కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. చందన, మంత్రాల, పెద్ద చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరో రెండు రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, వారం రోజుల్లో తొలగింపు ప్రక్రియ ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వివరించారు. పరిసర ప్రాంత ప్రజలకు, వాకర్స్‌కు ఆహ్లాదం పంచేలా.. చెరువు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఒక్కో చెరువు వద్ద నలుగురు చొప్పున సిబ్బందిని నియమిస్తున్నామని వెల్లడించారు. గుర్రపుడెక్క తొలగించాలని పలుమార్లు హెచ్ఎండీఏ అధికారులకు లేఖ రాసినా స్పందించలేదని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువుల పరిరక్షణ, అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని ఎమ్మెల్యే సబితారెడ్డి స్పష్టంచేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ప్రవీణ్(ఫైల్)

కందుకూరు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ధన్నారానికి చెందిన మంద ప్రవీణ్(36)కు పదిహేనేళ్ల క్రితం చంద్రాయణగుట్టకు చెందిన శిరీషతో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రవీణ్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. శనివారం ఉదయం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి గొంతు కింద గాయాలు ఉండటంతో హత్యచేసి, ఉరేసుకున్నట్లు చిత్రీకరించే ప్రయత్నం చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతుడి భార్యతో పాటు గ్రామానికి చెందిన చెవులపల్లి మహేశ్, బతకమ్మ నిఅలివేలుపై అనుమానం వ్యక్తంచేస్తూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య జరిగిందా? ఆత్మహత్యా అనే అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

మహేశ్వరం: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ డాక్టర్ రామ్ షెఫర్డ్ అన్నారు. నాగారంలోని శ్రీవిద్యా వికాస్ హైస్కూల్ 14వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి నుంచే కష్టపడి చదివే తత్వాన్ని బోధించాలన్నారు. క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, నిరంతరం సాధన చేయాలని పిలుపునిచ్చారు. భయంతో కాకుండా ప్రేమతో, ఆటపాటలతో పాఠాలు బోధించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నాగారం శ్రీవిద్యా వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ మంచె రాఘవేందర్ యాదవ్, జిల్లా బీస్మార్ట్ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, తెలంగాణ డిగ్రీ, పీజీ కాలేజ్ అండ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నర్సింహులు, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు చింతల సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



కందుకూరు: లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

కందుకూరు: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ అన్నారు. అర్హులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిధి నేదునూరుకు చెందిన కొమ్ము పార్వతమ్మకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.37 వేల చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు శనివారం ఆయన లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జి.శమంత, కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అప్జల్‌బేగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుష్పదర్శన్, నాయకులు సురేష్, ఎండీ అజారుద్దీన్, కె.విష్ణు, ఎండీ టిల్లు, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడ 2వ డివిజన్‌కు చెందిన దడిగ పద్మ ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. వైద్య ఖర్చుల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ సహాయంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం బాధితురాలికి రూ.60 వేల చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు శనివారం ఆయన.. లబ్ధిదారు పద్మకు చెక్కు అందజేశారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జగన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాద దాడిని ఖండిస్తూ నిరసన



లేమూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కందుకూరు: కాశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి హతమార్చడాన్ని నిరసిస్తూ శనివారం రాత్రి మండల పరిధిలోని లేమూరులో గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, ఎం.హన్మంత్ రెడ్డి, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, సి.ఆంజనేయులు మాట్లాడుతూ.. ఉగ్రమూకలను ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పాల్సిందేనన్నారు. మరోసారి భారత్ వైపు కన్నెత్తి చూడడానికి కూడా ముష్కర మూకలకు భయం కల్పించాలన్నారు. అందుకు యావత్ భారత్ ఒకటిగా నిలుస్తుందన్నారు. ఉగ్రవాదులను బహిరంగంగా ఉరితీయాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు ఎం.భాస్కర్, వి.పవన్‌రెడ్డి, జి.మధూకర్‌రెడ్డి, జి.దేవేందర్, రాజభూషణం, ఎ.రవీందర్, టి.సురేష్, కె.రత్నం, జి.రాములు, జి.సుధాకర్, జి.శ్రీను, ఎం.దాస్, జి.రవీందర్‌రెడ్డి, కె.కిషన్, ఎ.భిక్షపతి, జి.ప్రవీణ్, ఎం.స్వామి, సి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ఆర్‌కు చిత్రపటం బహూకరణ



మాజీ ఎమ్మెల్యేకు చిత్రపటం అందజేస్తున్న రాజునాయక్

మహేశ్వరం: మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా ఎస్టీసెల్ మండల మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్ శనివారం ఆయనకు చిత్రపటం బహూకరించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు శివ, మార్కెట్ కమిటీ సభ్యులు, నాయకులు శ్రీనివాస్‌నాయక్, భరత్, సురేష్, పాల్గొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

నందిగామ: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ అన్నా రు. మండల పరిధిలోని చేగూరులో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి ప్ర ముఖ రియాల్టర్ సర్వోత్తమ్ రెడ్డి తనవంతు సహా యంగా రూ. 27లక్షలను విరాళంగా శనివారం ఆల య కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విరాళం అందజేసిన సర్వోత్తమ్‌రెడ్డి దంపతులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో అంజంగౌడ్, రాజుగౌడ్, మంకాల శ్రీశైలం, శివ, నరేందర్, కృష్ణయ్య, భాస్కర్, నిరంజన్‌గౌడ్, నర్సింహ, రవితేజ, వెంకటచారి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం

కొత్తూరు: మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్పస్వామి, కామరాతి దేవి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎమ్మె సత్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా శనివారం గ్రామంలో ఆయన పలువురు సభ్యులు, కులపెద్దలతో కలిసి వేడుకలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. బీరప్పస్వామి వేడుకలకు స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని పేర్కొన్నారు. కాగా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు నీటి వసతి, విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు విజయ్, అజయ్, శ్రీశైలం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణకు విముక్తి

షాబాద్: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాక కోసం రాష్ట్ర ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని చందనవెల్లి మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను వాల్స్‌పై అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ అధినేత కేసీఆర్ చావునోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్‌కు ప్రజల్లో సముచిత స్థానం ఉందన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు విష్ణుచారి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

జల్‌పల్లి చెరువులో గుర్తు తెలియని మృతదేహం

పహాడీషరీఫ్: చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలమ్మ ఆలయ సమీపంలోని జల్‌పల్లి చెరువు ఒడ్డున మృతదేహం తేలియాడుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని బయటికి తీసి పరిశీలించగా కుళ్లిన స్థితిలో ఉంది. మృతుడి ఒంటిపై కేవలం అండర్‌వేర్ మాత్రమే ఉందని, వయస్సు 40- 45 మధ్య ఉంటుందని, నాలుగు రోజుల క్రితమే ఘటన జరిగి ఉంటుందని పేర్కొన్నారు. మృతిడి చేతిపై ఆంజనేయ స్వామితో పాటు టీఆర్ఎస్ అని టాటూ వేసి ఉన్నట్లు తెలిపారు. తెలిసిన వారు ఉంటే పీఎస్‌లో లేదా 87126 62367 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.